'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

గుర్తులపై రేవంత్ కపట నాటకం

టంకశాల అశోక్

తెలంగాణ ప్రభుత్వ అధికార చిహ్నంలో ప్రస్తుతం గల కాకతీయ తోరణం, చార్మినార్ చిత్రాలు రాచరికానికి గుర్తులని, కనుక వాటిని తొలగించి తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాల చిహ్నాలను చేర్చగలమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర గీతం అందుకు అనుగుణంగా ఉండగలవని కూడా అంటున్నారు. యథాతథంగా విన్నప్పుడు ఇవి గొప్ప ఆలోచనలుగా, ఇంకా చెప్పాలంటే విప్లవాత్మకంగా తోస్తాయి. అది కూడా వామపక్షాల నుంచో, విప్లవకారుల నుంచో, బడుగు వర్గాల ఉద్యమకారుల నుంచో గాక, కాంగ్రెస్ వంటి మధ్యేమార్గ వాద రాజకీయ నాయకుడు ఆ భాష మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దానితో పాటు కొన్ని ప్రశ్నలను కూడా ముందుకుతెస్తుంది.

కాకతీయులు, నిజాం నవాబులు ఫ్యూడల్ రాజులనటంలో సందేహం లేదు. అదంతా, దేశంలో ఎక్కడైనా, ఫ్యూడల్ రాచరిక కాలమేనన్నది చరిత్రతో కొద్దిపాటి పరిచయం గలవారందరికి తెలిసిన విషయమే. అప్పటి పాలనలకు అది ఒక పార్శ్వం కాగా, మరొక పార్శ్వంలో వారు పరిపాలనా పరంగా ఏమి చేశారనే ప్రశ్న మరొకటి. ఆ రెండింటిని కలిపి అది కాకతీయ రాజులు, నిజాం నవాబుల పొలిటికల్ ఎకానమీ అయింది. ఆ ప్రకారం కాకతీయ రాజులు ఫ్యూడల్ ఆర్థిక నిర్మాణ వ్యవస్థను, రాజకీయ నిర్మాణ వ్యవస్థను ఆ నాటి కాలానుగుణంగా కొనసాగిస్తూనే, ప్రజల కోసం ఏమేమి మంచి పనులు చేశారో, సాహిత్య-సాంస్కృతిక రంగాలను ఏ విధంగా తీర్చిదిద్దారో మనకు చరిత్ర చెప్తున్నది. అదే చరిత్రలోని కొందరు రాజుల వలె వీరు కేవలం దోపిడీ ఆర్థికవ్యవస్థను కొనసాగించి, వ్యక్తిగత స్థాయిలో భోగలాలసులుగా మిగలలేదు. ఈ వివరాలన్నీ కూడా చరిత్రలో నిక్షిప్తమై ఉన్నవే.

కాకతీయులు, నిజాం నవాబుల పొలిటికల్ ఎకానమీ ఇది. దీనిలో ముఖ్యమంత్రి దేనినైనా ఇంత బలంగా వ్యతిరేకించటానికి ముందు, అసలు తన పొలిటికల్ ఎకానమీ ఏమిటో తెలంగాణ ప్రజలకు వివరించాలి. ఆ పనిచేసినట్టయితే తన ప్రకటనలను, చర్యలను అర్థం చేసుకునేందుకు అదొక ప్రాతిపదికగా ఉపయోగపడుతుంది. అటువంటి ఫ్రేమ్‌వర్క్ ఏదీ ఆయన ఇవ్వకుండా ఇంత తీవ్రమైన ప్రకటనలు చేయటం వల్ల ప్రజలకు అయోమయం ఏర్పడుతుంది. ఒక చిహ్నం, ఒక విగ్రహం, ఒక గీతం అంటే అవి కేవలం రాజకీయం కాదు. ఆషామాషీ కాదు. అందుకు లోతైన అర్థం ఉంటుంది. దీర్ఘకాలికమైన భావన ఉంటుంది. కనుక కాకతీయులు, నిజాం నవాబుల పొలిటికల్ ఎకానమీపై, దాని గురించి తన అవగాహనపై, వర్తమానానికి వస్తే స్వాతంత్ర్యానంతరం దేశంలో గాని, తెలంగాణలో గాని పొలిటికల్ ఎకానమీపై తన అవగాహనలు ఏమిటో రేవంత్‌రెడ్డి ఒక పత్రాన్ని ప్రకటిస్తే సముచితంగా ఉంటుంది. దానిపై ఎవరి అభిప్రాయాలు వారివి కావచ్చు. అది సహజం. కాని దేనికైనా ఒక ప్రాతిపదిక పత్రం అవసరం. అది తయారుచేసే సమయంలో ఆయన, ఇప్పటికే పలువురు ఎత్తిచూపుతున్న విధంగా, భారతదేశ అధికార చిహ్నంలో ఏమున్నాయి, ఇతర రాష్ట్రాల చిహ్నాలలో ఏమున్నాయి, ఇండియాకు స్వాతంత్ర్యం రాకమునుపే ఏర్పడిన వివిధ దేశాల చిహ్నాలలో ఏమున్నాయనే విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఇంతకూ స్వయంగా రేవంత్‌రెడ్డి పొలిటికల్ ఎకానమీ ఏమిటి? ఆయన రాచరికాలతో ముడిబడిన ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకా? ఆ వ్యవస్థకు గ్రామీణ తెలంగాణలో ఆధిపత్యం వహించిన వర్గాలకు కూడా వ్యతిరేకా? ఆ వ్యవస్థలపై ఆయా కాలాల నుంచి మొదలుకొని ఈ రోజు వరకు ఉద్యమిస్తూ వస్తున్న అన్నివర్గాలకు, వారి ఉద్యమాలకు, పోరాటాలకు, వారి సంస్థలకు, వారి లక్ష్యాలకు అనుకూలురా? వారందరిపై, వాటన్నింటిపై జరుగుతున్న అణచివేతలన్నింటిని వెంటనే నిలిపివేస్తారా? వారందరి డిమాండ్లను శీఘ్రంగా నెరవేర్చగలరా? అందుకు ఆటంకమయ్యే చట్టాలను మార్చివేస్తారా? ఇప్పటికే గల చట్టాలన్నింటిని సత్వరమే అమలుపరుస్తారా? అమలును అడ్డుకునే ఫ్యూడల్ సామాజిక వర్గాలను, వ్యక్తులను నిష్పాక్షికమైన రీతిలో శిక్షిస్తారా? ఆయా వర్గాలు అటువంటి ఫ్యూడల్ పొలిటికల్ ఎకానమీని ఆధారం చేసుకొని నిర్మించుకుంటూ వస్తున్న అన్నిరకాల ఆర్థిక, రాజకీయ, సామాజిక సౌధాలన్నింటిని కూల్చివేయగలరా? ఈ రంగాలపై బడుగు, బలహీనవర్గాలకు, ఆదివాసీల నుంచి, దళితుల నుంచి, చిన్నకారు రైతుల నుంచి మొదలుకొని గ్రామాలలో, పట్టణాలలో గల శ్రమజీవుల వరకు భాగస్వామ్యాలు, ఆధిపత్యాలు కల్పించగలరా? స్వయంగా తనకు, తమ వర్గానికి, తమ వంటి ఇతర వర్గాలకు గల ఆధిపత్యాలను వదులుకోగలరా? ఇవి చేసేందుకు సిద్ధపడకుండా ప్రభుత్వ చిహ్నాలలో రాచరిక గుర్తులు తీసివేసి ప్రజల పోరాటాలు, త్యాగాల గుర్తులు తెస్తామనటం అర్థం లేని ఆర్భాటంగా, కపటపూరితమైన నటనగా మిగులుతుంది.

ఇవన్నీ వెర్రి ప్రశ్నలుగా, వితండవాదంగా తోచవచ్చు కొందరికి. కాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయా కాలాల పాలకుల పొలిటికల్ ఎకానమీతో, ప్రధానంగా తను ప్రస్తావించిన కాకతీయులు, నిజాం నవాబుల పొలిటికల్ ఎకానమీతో, అందులో గల ఒక వైపు చెడు ఒక వైపు మంచితో, చిహ్నాలకు సంబంధించి జాతీయంగా, వివిధ రాష్ట్రాలలో గల సంప్రదాయాలతో ఎటువంటి సంబంధం, అవగాహన లేకుండా విప్లవాత్మకమైన ప్రకటనలు పై పై మెరుగుల పద్ధతిలో గాలివాటంగా చేసినప్పుడు ఉత్పన్నమయ్యే ప్రశ్నలు ఈ విధంగానే ఉంటాయి. అందుకు ఆయన వివరణ ఇవ్వవలసి ఉంటుంది.

ఆయన తన పొలిటికల్ ఎకానమీ గురించి రెండు స్పష్టీకరణలు కూడా ఇవ్వాలి. గత ఎన్నికలకు ముందు బెంగళూరులో జరిగిన తమ సామాజికవర్గం వారి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేనికైనా భూమి ఆధారమని, అందువల్ల తమ వర్గం వారంతా పదేసి ఎకరాల భూమి ఖరీదు చేయాలని అన్నట్లు వార్తలు వెలువడ్డాయి. వాటిని ఆయన ఖండించినట్లు లేరు. తర్వాత ఒక చోట మాట్లాడుతూ, తెలంగాణలోని తమ సామాజికవర్గం వారంతా నాయకత్వం కోసం తనవైపు చూస్తున్నారనటం కన్పించింది. రాజశేఖర్‌రెడ్డి పాలనలో తమ వారు అనేకులు ఇంజినీరింగ్ కాలేజీలు పెట్టి ఫీజు రీ యింబర్స్‌మెంట్‌తో బాగుపడ్డారని, బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలను ఖచ్చితంగా అమలుచేయడం వల్ల వాటిలో అనేకం మూతబడి తమ వారు నష్టపోతున్నారన్నట్టు కూడా విన్నాము. నలుగురి దృష్టికి రానివి ఇంకా ఏమేమి ఉన్నాయో తెలియదు. విషయం అది కాదు. వీటిని బట్టి ముఖ్యమంత్రి పొలిటికల్ ఎకానమీ ఏమిటని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలన్నది చివరికి తేలుతున్న ప్రశ్న. ఆయన ఫ్యూడల్ రాచరిక వ్యతిరేక ప్రజానుకూల భావనలు కలవారా?, లేక స్వయంగా ఫ్యూడల్ లక్షణాలు కలవారా?

ఇటువంటి పరిస్థితులపై ఇక్కడి ప్రజలు మొదటినుంచి ఈనాటివరకు సాగిస్తూ వస్తున్న ఉద్యమాలన్నింటిని బలపరచేవారు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నంలో ఇపుడున్న చిత్రాలను మార్చి ప్రజల త్యాగాలు పోరాటాల చిహ్నాలను చేర్చగలమని గాని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా మార్చి ఒక రాష్ట్ర గీతాన్ని అదే ప్రకారం తేగలమని గాని ప్రకటించగలరు. తమకు అధికారం ఉందిగదా అని సదరు అధికార బలాన్ని ఉపయోగించి ఆ పని చేయటం వేరు, అందుకు అవసరమైన నైతిక బలం ఉండటం వేరు. తెలంగాణ ప్రజల స్థితిగతులలో, ఆరాట పోరాటాలలో ప్రతిఫలించే పొలిటికల్ ఎకానమీకి, రేవంత్ రాజకీయ జీవితంలో గతంలో గాని, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా కాని కనిపించే పొలిటికల్ ఎకానమీకి గల సంబంధం ఏమిటో ఆయనే చెప్పగలగాలి.

ఇంతకూ ఆ కొత్త చిహ్నాలలో, గీతంలో, తెలంగాణ తల్లి విగ్రహంలో ఏమి ఉండనున్నదో తెలియదు. అవి ఎట్లున్నప్పటికీ వాటితో నిమిత్తం లేకుండా, ముఖ్యమంత్రి చేసిన విప్లవాత్మకమైన వ్యాఖ్యల దృష్ట్యా, చరిత్రలో, వర్తమానంలో తెలంగాణ పొలిటికల్ ఎకానమీ గురించి, స్వయంగా తన పొలిటికల్ ఎకానమీ గురించి, వివిధ ఆర్థిక, సామాజికవర్గాల భిన్నమైన ఉద్యమాలు, పోరాటాల గురించి తన దృక్పథం ఏమిటో, అందుకనుగుణంగా తన ప్రభుత్వ విధానాలు, ఆచరణ ఏ విధంగా ఉండగలవో ఆయన ప్రజలకు తెలియజేయాలి.

అప్పుడు మాత్రమే ఈ చిహ్నాల మార్పులు కేవలం సంకేత ప్రాయాలుగా, యాంత్రికంగా మిగలక, అర్థవంతమవుతాయి. ఆ పని జరగకపోతే అంతా ఒక తమాషాగా మిగులుతుంది. ముఖ్యమంత్రి అటువంటి అపప్రథ తెచ్చుకోరని ఆశించాలి. పోతే గుర్తులలో ఇటువంటి విప్లవాత్మక మార్పులు తెచ్చే ముఖ్యమంత్రి పరిపాలన కూడా అదేవిధంగా విప్లవాత్మకంగా ఉండగలదని ప్రజలు ఆశించవచ్చునేమో ఆయన చెప్పాలి.

కేసీఆర్ దశాబ్ది దేశానికి దిక్సూచి

వై.సతీష్‌రెడ్డి
96414 66666

తెలంగాణ.. ఒక రాష్ట్రం మాత్రమే కాదు, దేశానికి ఒక స్ఫూర్తి కిరణం. అభివృద్ధి వైపు నడవాలనుకునే వారికి ఓ మార్గదర్శి. బుడిబుడి అడుగుల వయస్సులోనే దేశానికే వన్నె తెచ్చిన ఓ ప్రయోగశాల. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే.. తెలంగాణ ఏర్పడిన పదేండ్లలోనే చాలా సాధించి చూపించింది. సున్నా నుంచి కూడా కాదు, అంతకు దిగువ నుంచి మొదలైన ప్రయాణం నేడు వంద సంఖ్యను చేరుకుంది. అన్ని రంగాల్లో అద్భుత ప్రగతిని సాధించింది. ఇదంతా ఏదో తనంతట తానుగా జరిగిన అభివృద్ధి కాదు.

ఈ స్థాయిలో ప్రగతి కండ్ల ముందు కనిపిస్తోందంటే దాన్ని నడిపిన నాయకుడు ఎంత నైపుణ్యం కలిగినవాడు అయ్యుండాలి? ప్రతీక్షణం ఎంత జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకొని ఉండాలి? అలాంటి లక్షణాలున్న, నైపుణ్యమున్న గొప్ప వ్యక్తే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. తెలంగాణను చీకటిలో నుంచి వెలుగులోకి నడిపించడమే కాదు, దానిని దేశానికే వెలుగుగా మార్చిన గొప్ప వ్యక్తి, మహాశక్తి కేసీఆర్. ఎన్నో అవమానాలను తట్టుకొని, అడ్డంకులను దాటుకొని తెలంగాణ నిలబడిందంటే దానికి కారణం కేసీఆర్.

తెలంగాణ ఆవిర్భావమే ఓ గొప్ప మహోద్యమం. అడుగడుగునా అడ్డంకులు, చీదరింపులు, ఛీత్కారాలు. 'మీకెందుకు రాష్ట్రం?' అని ఒకరు, 'మీకు పాలన తెలియద'ని మరొకరు, 'అసలు చిన్న రాష్ట్రాలతో ఉపయోగం ఉండదు. మరింతగా కష్టాల్లోకి వెళ్లక తప్పద'ని మరికొందరు అన్నారు. ఎన్నో ఉదాహరణలు చూపించారు. కానీ, చిన్న రాష్ట్రాలతో ఉపయోగం ఉండదని మాట్లాడినవారికి చెంపపెట్టు లాంటి సమాధానాలు ఇచ్చింది ఈ నేల. చిన్న రాష్ట్రాలతో ఎంత ప్రగతి సాధించవచ్చో కండ్లకు కట్టింది. 'చిన్న రాష్ట్రాలే దేశాన్ని నడిపిస్తాయి. దేశానికి అన్నం పెడతాయి. పెద్ద రాష్ట్రాలను సాకుతాయి' అని చూపించింది, ప్రస్తుతం చూపిస్తున్నది మన తెలంగాణ.

ఒకప్పుడు ఈ ప్రాంతం కరువుకు, కష్టాలకు, కన్నీళ్లకు చిరునామా. పేదరికాన్ని భరించలేక, పని దొరక్క బొంబాయి, దుబాయి వలసపోయిన కుటుంబాలెన్నో. పంటలకే కాదు, పాడి పశువులు తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకని దుస్థితి తెలంగాణది. అలాంది పరిస్థితుల్లోనూ మన వనరులు, సంపదను దోచుకునేందుకు నాటి పాలకులు కాచుకుని కూర్చునేవారు. ఈ ప్రాంత ప్రజలు ఆకలితో అల్లాడుతున్నా పట్టించుకున్న పాపానపోలేదు. కానీ, నేడు తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. వ్యవసాయరంగంలో ఉమ్మడి రాష్ట్రాన్ని మించి ప్రగతి సాధించింది. దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా మారింది. ఒక్క వ్యవసాయరంగంలోనే కాదు, అన్ని రంగాల్లోనూ తెలంగాణ నేడు అగ్రభాగాన నిలిచిందంటే దానికి కారణం కేసీఆరే.

ఈ సందర్భంగా మనం మరో ఉదాహరణను పరిశీలించాలి. చిన్న రాష్ట్రాలపై అపోహలకు కారణాలు ఏమిటనేది తెలుసుకోవాలి. 2000వ సంవత్సరంలో అప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. అవే ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాలు. అవి ఏర్పడి 24 ఏండ్లు పూర్తయ్యాయి. అంటే వాటి ప్రగతి ఏ స్థాయిలో ఉండాలి? కానీ, ఆ రాష్ట్రాలు నత్తలకు నడక నేర్పిస్తూనే ఉన్నాయి. ఉత్తరాఖండ్ జీఎస్డీపీ రూ.3.33 లక్షల కోట్లుగా ఉంటే.. అందులో 28.2 శాతం అప్పులున్నాయి. ఝార్ఖండ్ జీఎస్డీపీ రూ.4.23 లక్షల కోట్లు కాగా.. 27 శాతం అప్పులే. ఛత్తీస్‌గఢ్ జీఎస్డీపీ రూ.5 లక్షల కోట్లయితే.. అందులో 25 శాతం అప్పులే. అదే తెలంగాణ విషయానికొస్తే.. జీఎస్డీపీ దాదాపుగా రూ.14 లక్షల కోట్లు కాగా.. అప్పులు 23.8 శాతమే. రాష్ట్ర ఆవిర్భావం సమయంలో తెలంగాణ జీఎస్డీపీ రూ.5.05 లక్షల కోట్లు కావడం గమనార్హం. ఇక ఆ రాష్ట్రాల తలసరి ఆదాయాలు వరుసగా.. ఛత్తీస్‌గఢ్ రూ.1.33 లక్షలు, ఝార్ఖండ్ రూ.91 వేలు, ఉత్తరాఖండ్ రూ.2.33 లక్షలు కాగా.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3 లక్షలకు పైగా ఉండటం విశేషం. 2014-15 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.28 లక్షలు. అదే ఉత్తరాఖండ్ తలసరి ఆదాయం రూ.1.32 లక్షలు, ఛత్తీస్‌గఢ్ తలసరి ఆదాయం రూ.72 వేలు, ఝార్ఖండ్ తలసరి ఆదాయం రూ.57 వేలు. ఒక సారి గత, ప్రస్తుత తలసరి ఆదాయాలను పరిశీలిస్తే.. ఏ రాష్ట్ర ప్రగతి ఏ విధంగా ఉందనేది తేటతెల్లమవుతుంది. పదేండ్లలో తెలంగాణ సాధించిన ప్రగతికి ఇది ఒక పరిపూర్ణమైన ఉదాహరణ.

ఆహారధాన్యాల ఉత్పత్తిలో 2014-15లో 2.815 శాతం పెరుగుదల ఉండగా.. 2022-23లో 5.879 శాతం పెరుగుదల నమోదైంది. పారిశ్రామిక రంగంలో మహిళలకు అవకాశాలు పెరిగాయి. 40 శాతం పరిశ్రమలు మహిళలే యజమానులుగా పురుడుపోసుకున్నాయి. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే రాష్ట్రం నుంచి ఫ్లోరైడ్ మహమ్మారిని పారదోలారు. భూగర్భ జలాలు పెరిగాయి. అటవీ విస్తీర్ణం పెరిగింది. పట్టణాల్లో చెత్త నుంచి విద్యుత్తు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, గ్రామాల అభివృద్ధి.. ఇలా ఒక్కటేమిటి అన్నీ కండ్ల ముందే కనిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని గుర్తించిన కేంద్రం అవార్డులతో పట్టం కట్టింది.

ఇలా చెప్పుకొంటూపోతే తెలంగాణ విజయాల పరంపరకు ముగింపు ఉండదు. ఆ విజయాలకు ఆద్యుడు కేసీఆర్. చీకటి నుంచి వెలుగుల వైపు తెలంగాణ ప్రయాణానికి ఒక వారధి మాత్రమే కాదు, సారథిగా ముందుండి నడిపించారు. ఒక పరిపూర్ణమైన తెలంగాణను రూపకల్పన చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయనకు ప్రతీ ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉన్నది. ఎప్పటికైనా మనం ఆయనకు రుణపడి ఉంటామని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్)

బరిగీసి కొట్లాడినం

మోచేతి నీళ్లను ధిక్కరించి
బరిగీసి కొట్లాడినం
వైరుధ్యాలన్నీ మరిచి ఒక్కటై
ఆత్మగౌరవ పతాకమై ఎగసినం
ఎగతాళి చేసిన వారి గుండెల్లో
పోరు గీతాలమై గర్జించినం
ఊరూవాడా తేడా లేకుండా
జంగు సైరన్ వినిపించినం
నిరసనలు నినాదాలే ఆయుధంగా
ఆశయం సిద్ధించే దాకా సాగినం
రాజ్యాంగమే ఆలంబనగా
చట్టబద్ధ రణమే చేసినం
ప్రాణాలను పణంగా పెట్టినం
జీవితాలను హననం చేసుకున్నాం
చావు నోట్లో తలను పెట్టి
పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న
కాలమైనాం
దేశం నోటి వెంట 'జై తెలంగాణ'
నినాదం వెల్లువెత్తేదాక పోరు
సల్పినం
దశాబ్దంగా ఒక్కటై వెలిగినం
తెలంగాణ పౌరుషం నిలిపినం!
జై తెలంగాణ! జైజై తెలంగాణ!!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

అజ్ఞానమా? అబద్ధాలా? ఆలోచించండి!

కనకదుర్గ దంటు
89772 43484



సంస్కృతంలో 'ఋతము' అంటే సత్యం. అందుకే అబద్ధాన్ని 'అనృతము' అంటారు. అక్షరమాలలో 'ఋ,ఋ' తీసేసినప్పటి నుంచి సత్యం చెప్పటం కూడా తగ్గిపోయింది. గత పదేండ్లలో ఇంకా తగ్గిపోయింది మన దేశంలో!

ఏమిటో అంత అలవోకగా అబద్ధాలు ఎలా నోటి నుంచి జాలువారుతాయో అర్థం కాదు. తెలిసి చెప్తారో, తెలియక చెప్తారో ఇంకా అయోమయం! ఆరో క్లాసు పిల్లవాడు ఆరొందల ఏండ్ల కింద జరిగిన మొదటి పానిపట్ యుద్ధం 1526 బదులు 1527 అని రాస్తే ఉపాధ్యాయుడు సున్నా పెట్టడమే కాకుండా దెబ్బలు కూడా కొడతాడు. అయితే స్కూల్లో దెబ్బలు తిన్నవాళ్లకే సరైన సమాచారం గుర్తుంటుంది. స్కూలుకే వెళ్లని వాళ్లను ఏమనగలం? అందుకే మేధావి అంబేద్కర్ రాజకీయ పదవులకు పోటీ చేసేవారికి వయస్సు నిబంధనతో పాటు, ఓటు వేసేవారికి కూడా కనీస విద్యార్హత ఉండాలని రాజ్యాంగంలో రాయాలని నెహ్రూతో వాదించారు. తన వారసుల సంగతి ముందే ఊహించారేమో, నెహ్రూ ఆ నిబంధనలను ఒప్పుకోలేదు. ఫలితంగా మన ప్రస్తుత ప్రధానమంత్రికి పాపం సెప్టెంబర్ 11, 1906లో దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్‌బర్గ్‌లో మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ (ఈ పేరు ఆయనకు అసలు తెలియకపోవచ్చు) తన అహింసాత్మక నిరసనను మొదలుపెట్టారని ఎలా తెలుస్తుంది? అయినా పుస్తకాల్లో చదువుకోనివారికి తను పుట్టడానికి అర్ధ శతాబ్దం ముందు జరిగిన విషయాలు తెలియాలనుకోవడం అత్యాశ కదా?

ఒకవేళ లౌకికవాదాన్ని నమ్మిన విశ్వ మానవుడు గాంధీ కేవలం కాంగ్రెస్ పార్టీకే చెందుతాడని పొరపాటు పడి అన్నీ తెలిసే ప్రధానమంత్రి గాంధీ 1982 తర్వాతే జనానికి తెలిశారని అన్నాడనుకోండి. అది రాజకీయ అబద్ధం అవుతుంది. అయినా మనకేమన్నా కొత్తా ఇటువంటివి వినడం! ఈ పదేండ్లలో దాదాపు 743 కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి విన్నాం. ఒక్కటైనా పట్టుమని ఏడాది నిలబడిందా? మరి అన్న మాట నిలబెట్టుకోనివాడిని హిందీలో, గుజరాతీలో ఏమంటారో కానీ, అచ్చ తెలుగులో మాత్రం 'అబద్ధాలకోరు' అని అంటారు. ఒక్కసారి గరుడ పురాణం చదివితే ఎవ్వడూ పొరపాటునైనా అబద్ధం చెప్పడు. అయినా ఖర్మ, ఆ చదవటం లేకే కదా ఇన్ని అబద్ధాల పునాదుల మీద రాజకీయ నిచ్చెనలు నిలబడుతున్నాయి!

అజ్ఞానం ఉన్నవాళ్లకు కొద్దిగానైనా నమ్రత ఉంటే వాళ్లకు కొందరైనా మిత్రులవుతారు. కానీ అజ్ఞానానికి అహంకారం తోడైతే, దానికి పక్షపాత ధోరణి, అధికార దాహం, ప్రతీకారేచ్ఛలు కలిస్తే అది వ్యక్తికే ప్రమాదం. మొదటి ఎన్నికలలో (2014) ఉత్సాహంతో, రెండో ఎన్నికలలో (2019) మత మౌఢ్యంతోనూ గెలిపించినవాళ్లే ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారు. ప్రమాణం చేసి చెప్పిన 15 లక్షల రూపాయల కోసమే కాకుండా, మన దేశంలో పురాతన సంస్కృతిని ఉద్ధరిస్తాడనీ, సంస్కృతం వేదాలు పునరుద్ధరిస్తాడనీ మొదటిసారి గెలిపించారు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతా' అని వేదికలెక్కి ఆర్ఎస్ఎస్, బీజేపీ అధికారంలోకి వస్తేనే భారత మహిళలకు ముక్తి, మోక్షం అన్న ఉపన్యాసకులే కాక, పీఠాధిపతులు కూడా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. అయితే బిల్కిస్ బానో, అంతర్జాతీయ పతకాలు సంపాదించిన మహిళా యోధులే కాదు, దేశంలో ఆడవారి మీద అత్యాచారాలు ఎక్కువయ్యాయి. బీజేపీ రాజకీయ నాయకులే స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు. మరి వీటన్నింటికీ నాయకత్వ స్థానంలో ఉన్నవారిది బాధ్యత కాదా? ఏం కాలేదు, 2014 తర్వాత స్త్రీ గౌరవం దేశంలో అఖండంగా పెరిగిందని అబద్ధం చెప్పేసుకొని సంతోషపడదామా? మరి ప్రపంచ ర్యాంకుల్లో స్త్రీల మీద అత్యాచారాలు జరిగే దేశాల్లో భారతదేశం ప్రమాదకరమైనది అన్న సత్యాన్ని దాచగలమా? గ్రీకు దేశ తత్త్వవేత్త ప్లేటో రాజకీయ నాయకుడు విజ్ఞానవేత్త, తత్త్వవేత్త కావాలని ఆదేశించాడు. ఇప్పుడు మన దేశంలో అజ్ఞానవేత్త (తెలియక మాట్లాడితే), లేక అనృతమూర్తి (తెలిసి అబద్ధాలు చెప్తే) ప్రధానమంత్రిగా ఉన్నాడు. మూడోసారి గెలవడమే కాదు, ఇంకో రెండుసార్లు గెలిచి భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో దిగదుడుపు చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు.

2014లో రాజకీయ నాయకుల పదవీ విరమణ వయస్సు 75 సంవత్సరాలైతే, ఇప్పుడు సొంత రాజ్యాంగం రాసి దాన్ని 90 ఏండ్లు చేశాడు. ఇక తత్త్వవేత్త సంగతంటారా? మన ప్రధానమంత్రి తత్వానికంటే అర్థికానికి ఎక్కువ గౌరవం ఇస్తాడు. సంపదను అందరూ సరిగ్గా ఉపయోగించుకోలేరు కాబట్టి దేశంలో ఒకళ్లిద్దరి దగ్గర దేశ సంపద అంతా ఉంటే మంచిదని అనుకుంటాడు. భూస్వామ్య వ్యవస్థలో పది మంది కొడుకులు కొట్టుకు చస్తున్నా, ఆస్తి అంతా తండ్రి పేరు మీదే ఉండే పద్ధతి అన్నమాట!

అనుభవించినవాడికే కష్టం తెలుస్తుంది అన్న సామెత కూడా తప్పవుతుంది అప్పుడప్పుడు. లేమి నుంచి పైకి వచ్చి అత్యున్నత స్థానం అధిరోహించిన వాడికి పేదవాడి కష్టాల గురించి ఎక్కువ అవగాహన ఉండాలి కదా! సంపన్న కుటుంబంలో పుట్టిన రతన్ టాటా వితరణశీలి అవడం ఏమిటి, అష్ట దరిద్రంలో పెరిగానని చెప్పిన మనిషికి పేదవాళ్ల పట్ల ఈ ద్వేషం ఏమిటి? ఎంత ఆలోచించినా అర్థం కాని విషయం ఇది. ఏం చేస్తాం ఎన్నుకుంటే అనుభవిద్దాం, లేకపోతే తోసి రాజు అందాం!



ధ్యానం కాదు.. ఫొటోషూట్!

కన్యాకుమారిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్నదంతా నాటకమే. ఆయన ఎలాంటి ధ్యానం చేయడం లేదు. అక్కడ జరుగుతున్నదంతా ఫొటోషూట్‌లే. ఆ ఫొటోషూట్ ముగిసిన తర్వాత నరేంద్రమోదీ అక్కడ ఉండనే ఉండరు. వెంటనే తిరిగి వెళ్లిపోతారు.

- తేజస్వీ యాదవ్
ఆర్జేడీ నాయకుడు